సాక్షి తిరుపతి

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



మనసెలా ఒప్పిందమ్మా?

అప్పుడే పుట్టిన పురిటి బిడ్డను రోడ్డు పక్కన పడేసిన ఘటన గురువారం ఓజిలి మండలంలో చోటు చేసుకుంది. - 8లో



కెమి'కిల్'కర్మాగారాలు

తిరుపతి జిల్లాలోని చాలా కెమికల్ రసాయన కర్మాగారాల్లో కార్మికులకు సరైన భద్రతా చర్యలు లేవు. - 8లో



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి కలెక్టర్‌కు సూచించారు. - 8లో

■ రాయలసీమ పెద్దాస్పత్రిగా పేరుగాంచిన తిరుపతి రుయా ఆస్పత్రి పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా మారింది. ఆస్పత్రిలో తరచూ మహిళా వైద్యులు, నర్సింగ్ సిబ్బందిపై దాడులు పెరుగుతున్నాయి. వరుస దొంగతనాలు కలవరపెడుతున్నాయి. అటవీ ప్రాంతం సమీపంలో ఉండడంతో వన్యప్రాణులు, విష సర్పాల బెడద ఎక్కువ. ఆస్పత్రిలో వివిధ వార్డుల చుట్టూ ముళ్లపొదలు, రాళ్లగుట్టలు పేరుకుపోయి అసాంఘిక కార్యక్రమాలకు స్థావరాలుగా మారాయి. వార్డుల నుంచి వైద్య విద్యార్థినులు హాస్టల్స్‌కు వెళ్లే మార్గం చిమ్మచీకటిని తలపిస్తోంది. సరైన భద్రత లేదు. ఏదైనా అనుకోని ప్రమాదం జరగకముందే రాష్ట్ర ప్రభుత్వం, ఆస్పత్రి అధికారులు స్పందించాల్సి ఉంది.

■ స్విమ్స్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులకు సరైన భద్రత లేదు. రాత్రి సమయాలలో విధులు నిర్వహించాలంటే వణికి పోతున్నారు. ఎమర్జెన్సీ మెడిసన్ విభాగం, జనరల్ వార్డుల్లో పనిచేసే డాక్టర్లు, పీజీలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల అత్యవసర విభాగంలో ఓ రోగి స్టాఫ్ నర్స్‌పై దాడి చేశాడు. ఈ ఘటన అప్పట్లో వైద్య సిబ్బందిని కలవరపెట్టింది. తమకు రక్షణ కల్పించాలని నాడు పెద్ద ఎత్తున నిరసనకు దిగినా ఫలితం లేకపోయింది. గతంలో అత్యవసర విభాగం వద్ద 24 గంటలు పోలీసు పహారా ఉండేది. ఒకరిద్దరు మినహా ఇతరులను లోనికి అనుమతించేవారు కాదు. ఇప్పుడు అక్కడ అలాంటి నిబంధనలు అమలు కావడం లేదు.

■ జిల్లాలో పెద్దాస్పత్రులుగా పేరుగాంచిన తిరుపతి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లోనే పరిస్థితి ఇలా ఉందంటే ఇక మిగిలిన ఆస్పత్రుల్లో ఎలాంటి స్థితిగతులుంటాయో అర్థం చేసుకోవచ్చు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో కనీస వసతులు లేక, రక్షణ చర్యలు ఉండక నర్సులు, మహిళా డాక్టర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. కోల్‌కతా ఘటన నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి దాపురించింది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని డాక్టరమ్మలు నినదిస్తున్నారు.


- తిరుపతి తుడా/తిరుపతి సిటీ



డాక్టరమ్మకు.. భద్రత కరువు!

జిల్లాలోని ఆస్పత్రుల్లో రక్షణ చర్యలు శూన్యం

- మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రిపూట విధులు నిర్వహించాలంటే నరకం
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా రుయా
- వాష్‌రూమ్‌లు, రెస్ట్ రూమ్‌లు నిల్
- పోలీసు, సెక్యూరిటీ బందోబస్తు అంతంతమాత్రమే
- నిఘా వ్యవస్థ మెరుగుపడాలి
- అధికారులు, ప్రభుత్వం తక్షణం స్పందించాలని జూడాల డిమాండ్



రుయాలో చిమ్మచీకట్లోనే వెళ్తున్న నర్సింగ్ విద్యార్థినులు

రుయా.. ఇంతేనయా!



రుయా ప్రాంగణంలోని ఎస్వీ వైద్యకళాశాల, వైద్యవిద్యార్థుల వసతిగృహాల సముదాయాల పరిసరాలు భయానకవాతావరణాన్ని తలపిస్తున్నాయి. చిట్టడువులు, ముళ్లపొదలతో నిండిపోయాయి. పగటిపూట సైతం ముళ్లపొదల మాటున రావాలంటే డాక్టర్లు వణికిపోతున్నారు. అలాంటి స్థావరాలను ఆవాసాలుగా చేసుకుని ఆటోవాలాలు సేదతీరుతున్నారు. ఇలా రోజుకు పదుల సంఖ్యలో ఆటోలో కొంతమంది యువకులు రుయా ప్రాంగణంలో తిష్ట వేస్తున్నారు. సాయంత్రం మసకబడితే అసాంఘిక శక్తుల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. ఆకతాయిలు గంజాయి, మద్యం సేవిస్తూ హల్‌చల్ సృష్టిస్తున్నారు. ప్రధానంగా వైద్యకళాశాల గ్రౌండ్ చుట్టుపక్కల మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. మద్యం సేవించి ఆపై బాటిళ్లతో భవనాలు, ప్రహరీగోడలపై విసురుతున్నారు. మహిళా వైద్యుల వసతి సముదాయాల ప్రాంగణం చుట్టూ ఇదే పరిస్థితి నెలకొంది.



చిమ్మచీకట్లో రుయా ఆస్పత్రి నుంచి శ్రీవెంకటేశ్వర హృదయాలయానికి వెళ్లే మార్గం



ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద చిమ్మచీకటి

ఆస్పత్రుల్లో తక్షణం తీసుకోవాల్సిన చర్యలు

- అత్యవసర విభాగం వద్ద పోలీసు భద్రత పెంచాలి
- గత తరహాలో పేషెంట్ దగ్గరకు అటెండర్‌ను పంపించేందుకు ఎంట్రీ పాస్ విధానాన్ని పునరుద్ధరించాలి
- పోలీసు అవుట్ పోస్టును పటిష్టంగా నిర్వహించాలి
- రాత్రివేళల్లో బయటి వ్యక్తుల వాహనాల రాకపోకలపై నిఘా ఉంచాలి
- రుయా, ప్రసూతి ఆస్పత్రులు, వైద్య కళాశాల ప్రాంగణంలో అసాంఘిక కార్యాకలాపాల అడ్డుకట్టకు పోలీసు పెట్రోలింగ్ చేపట్టాలి
- రుయా ప్రాంగణంలో పూర్తి స్థాయిలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి
- ప్రతి వార్డు, రహదారులను కవర్ చేస్తూ పటిష్ట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి
- ఆర్వో వాటర్ సౌకర్యం కల్పించాలి
- మహిళా వైద్యులు సంచరించే ప్రాంతాలలో సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి
- స్టేట్, సెంట్రల్ ఫోర్స్ పోలీసులు క్రమంతప్పకుండా పర్యవేక్షణ చేయాలి
- ప్రతి వార్డులోనూ సెక్యూరిటీ అందుబాటులో ఉండాలి
- విధుల్లో భాగంగా రాత్రి సమయాల్లో పలు విభాగాలకు వెళ్లే సమయంలో సెక్యూరిటీ వెంట రావాలి
- డ్యూటీ ప్రదేశాలలో సరైన వాష్ రూమ్‌లు, రెస్టరూమ్‌లు అందుబాటులో ఉంచాలి



తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణంలోని ఓ మార్గంలో చీకట్లో చెట్ల వద్ద గుమికూడిన యువకులు



రుయాలో పనిచేయని విద్యుత్ లైటు

“

సుప్రీం సూచనలు అమలు చేయాలి



మహిళా వైద్యుల రక్షణకు సుప్రీంకోర్టు చేసిన సూచనలను కచ్చితంగా అమలు చేస్తే రక్షణ పెరుగుంది. మహిళా డాక్టర్లలో ఆత్మవిశ్వాసం పెరగాలంటే సమాజం నుంచి మద్దతు అవసరం. మహిళా వైద్యులు ప్రత్యేకించి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రయత్నించాలి. ఆత్మరక్షణ కోసం విద్యార్థినులు కరాటే వంటివి నేర్చుకోవాలి. వైద్యుల పట్ల ప్రజలకు గౌరవం పెరగాలి.

–డాక్టర్ వెంగమ్మ, రిటైర్డ్ డైరెక్టర్, వీసీ, స్విమ్స్ వర్సిటీ

నిఘా పెంచాలి



ప్రభుత్వాస్పత్రుల్లో నిఘా వ్యవస్థ పెంపొందించాలి. నిఘా ఉంటే అరాచకాలకు పాల్పడే వ్యక్తుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వాస్పత్రులు ఆవాసాలుగా ఉన్నాయి. చెక్ పాయింట్ల వద్ద అనుమతులపై ఆంక్షలు విధించాలి. బలహీనంగా ఉన్న పోలీస్ అవుట్ పోస్టులను బలోపేతం చేయాలి. అదేస్థాయిలో చట్టాలు కఠినతరం చేయాలి.

–డాక్టర్ ఎస్వీ రమణయ్య, రిటైర్డ్ ప్రిన్సిపల్, ఎస్వీ మెడికల్ కళాశాల

రవాణా వ్యవస్థ ఉండాలి



హాస్టల్స్ నుంచి విధులకు వచ్చే మహిళా వైద్యులకు, విద్యార్థులకు రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. రోగుల వార్డుల్లో వైద్యులకు ప్రత్యేక వాష్‌రూమ్‌లు, స్టాఫ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి. ఇవి లేకపోవడంతో రాత్రివేళ హాస్టల్స్‌కు వెళ్లి రావాల్సి వస్తోంది. వీటిని మెరుగుపరిస్తే రాత్రివేళల్లో వార్డుల నుంచి బయటకు రావాల్సి పరిస్థితి ఉండదు. రోగుల అటెండర్ల మాటున ఆకతాయిలు హాస్పిటల్ ప్రాంగణంలో తిష్టవేస్తున్నారు. వారి విషయంలో భద్రతా సిబ్బంది దృష్టి సారించాలి.

–డాక్టర్ భారతి, రిటైర్డ్ సూపరింటెండెంట్, రుయా ఆస్పత్రి

రక్షణ కల్పించాలి



రుయా ఆస్పత్రిలో మహిళా వైద్యులకు స్టేట్, సెంట్రల్ ఫోర్స్‌తో రక్షణ కల్పించాలి. వార్డుల్లో, రుయా ఆస్పత్రి ఇన్నర్ రహదారుల్లో లైటింగ్ మెరుగుపరచాలి. అదేవిధంగా పటిష్టమైన సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. హాస్టల్స్ నుంచి రాత్రి సమయంలో వార్డుల్లోకి రాకపోకలు సాగించే సమయంలో ప్రత్యేకంగా సెక్యూరిటీని వెంట పంపించే ఏర్పాట్లు చేయాలి.

–డాక్టర్ ప్రత్యూష, ఓబీజీ, మెటర్నటీ ఆస్పత్రి, తిరుపతి

విచ్చలవిడిగా తిరుగుతున్న అటెండర్లు



అత్యవసర విభాగం, రోగులు చికిత్స పొందే వార్డుల్లోకి అటెండర్లు విచలవిడిగా తిరుగుతున్నారు. వైద్యసేవలకు ఆటంకం కలిగిస్తున్నారు. విచక్షణ కోల్పోయి వ్యవహరిస్తున్నారు. మహిళా వైద్యులు అని చూడకుండా దుర్భాషలాడుతున్నారు. దీన్ని అధికారులు కంట్రోల్ చేయాలి.

–డాక్టర్ ప్రజ్ఞశ్రీ, డాక్టర్ అల్ఫియా, జనరల్ మెడిసన్ విభాగం



ఒకే రక్షకభటుడితో పోలీస్ అవుట్ పోస్ట్



రుయా వద్ద జూడాలకు ఇస్కాన్ ప్రతినిధుల మద్దతు



రుయా ఆస్పత్రి ప్రాంగణంలో బహిరంగ ధూమపానం

నైట్‌డ్యూటీ ఓ చాలెంజ్



మహిళా వైద్యులకు రాత్రి విధులు ఓ చాలెంజ్‌గా ఉంటున్నాయి. పనిచేసే ప్రదేశాలలో కనీస సౌకర్యాలు ఉండవు. వాష్‌రూమ్‌లు లేవు. రెస్ట్ రూమ్‌ల మాటే ఉండదు. నర్సింగ్ స్టాఫ్‌కు, డాక్టర్లకు అందరికీ కలిపి ఒకే రెస్ట్ రూమ్. నరకం అనుభవిస్తున్నాం

–డాక్టర్ శ్వేత, పిడియాట్రిక్ విభాగం

ప్రతివార్డుకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి



రుయాలో ప్రతి వార్డుకు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. అత్యవసర విభాగంలో ఒక బెడ్‌కు ఒక నర్సు విధానాన్ని అమలు చేయాలి. ప్రస్తుతం 400 మంది నర్సులకు ఒకే రెస్ట్ రూమ్ ఉంది. రాత్రి పూట భద్రత మరింత పెంచాల్సిన అవసరం ఉంది.

–భువనేశ్వరి, హెడ్‌నర్స్, రుయా ఆస్పత్రి

ఆరని ఆగ్రహావేశాలు

కోల్‌కతా ఘటన నేపథ్యంలో జిల్లాలో నిరసనలు మిన్నంటుతున్నాయి. మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని మూకుమ్మడిగా ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ క్రమంలో సుప్రీంకోర్టు సైతం తీవ్ర స్థాయిలో స్పందించింది. వైద్యుల రక్షణకు పది మంది సభ్యులతో కూడిన న్యాయ కమిటీని నియమించింది. వైద్యుల సంరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డాక్టర్లు కోరుతున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆస్పత్రుల్లో నిఘా వ్యవస్థను పెంచాలని, మౌలికవసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



స్విమ్స్ ఆస్పత్రి వద్ద నిరసన దీక్షలో జూనియర్ డాక్టర్లు

మహిళల రక్షణకు కఠిన చట్టాలు రావాలి

తిరుపతి కల్చరల్: మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, హత్యల వంటి దుశ్చర్యలను సమూల నివారణ కోసం కఠినమైన చట్టాలు తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు చేపట్టాలని మజీద్ ఏ మహమ్మదీయ ఏకరా ట్రస్ట్ చైర్మన్ అయిషా పర్వీన్, మజీద్ ఏ.మహమ్మదీయ ముతవల్లి అధ్యక్షుడు హిందూస్థాని డిమాండ్ చేశారు. కతకత్తా ఘటనను నిరసిస్తూ మజీద్ ఏ మహమ్మదీయ ఏకరా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం జీవకోనలో ముస్లింలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ విద్యార్థిని అత్యాచారానికి కారకులైన వారందర్నీ కఠినంగా శిక్షించాలన్నారు. గతంలో కశ్మీర్‌లో ఆసిఫా అనే అర్నేళ్ల చిన్నారిని గుడిలో అత్యాచారం చేస్తే ఇంత వరకు దోషులకు శిక్షపడలేదని, అలాగే గుంటూరులో ఆయేషాను అత్యాచారం చేసి చంపేస్తే ఇంత వరకు కేసు ఏమైందో కూడా తెలియదని ఆరోపించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ముస్లింలు పోరాటాలు కొనసాగిస్తారని హెచ్చరించారు. సుమయ్య, ఫాతిమా, చాంద్‌బాషా, ఖాదర్‌రెడ్డి బాషా, ఖదీర్ షంషేర్, రహమతుల్లా, సదాఫ్ జేబీ, షాజహాన్, సాబ్జాన్ పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న ముస్లింలు

క్లుప్తంగా

ప్రైవేటు స్కూల్‌లో అగ్నిప్రమాదం

– పాడైన ఫర్నిచర్ దగ్ధం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఓ ప్రైవేటు (సోక్రటీస్ ఇంగ్లిష్ మీడియం) స్కూల్‌లో గురువారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. బైరాగి పట్టెడలోని రెండంతస్తుల భవనంలో ప్రైవేటు స్కూలు నడుస్తోంది. ఆ స్కూలులో పాడైన ప్లాస్టిక్ ఫర్నిచర్, డెస్కులను టెర్రస్‌పైనున్న ఓ చిన్నగదిలో భద్రపరిచారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆ గదిలో మంటలు చెలరేగి పొగలు అలముకున్నాయి. పాఠశాల సిబ్బంది గమనించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని చెబుతున్నారు. టెర్రస్‌లో అగ్ని ప్రమాదం సంభవించడంతో పెను ప్రమాదం తప్పింది.

ఉరేసుకుని వ్యక్తి మృతి

చంద్రగిరి: ఉరివేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఐతేపల్లి సచివాలయ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతికి చెందిన పోలీనాయుడు అలియాస్ బాల(33) తమిళనాడుకు చెందిన మహిళతో సహజీవనం చేస్తున్నారు. బతుకుదెరువు కోసం తొమ్మిదేళ్ల క్రితం ఐతేపల్లికి వసల వచ్చాడు. బాల ట్యాక్సీ డ్రైవరుగా పనిచేస్తుండగా, మహిళ భువనేశ్వరి రోజువారీ కూలీ. ఈ క్రమంలో గురువారం సాయంత్రం భువనేశ్వరి, బాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన బాల సచివాలయ సమీపంలోని ఓ పాత భవనంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిందితుడిపై కేసు

తిరుమల : నకిలీ పాస్‌పోర్టుతో రెండు శ్రీవారి కల్యాణం టికెట్లు పొందిన తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తిపై తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. వన్‌టౌన్ పీఎస్ సీఐ విజయకుమార్ తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరుకు చెందిన ఎస్.మురళీధర్, ఎస్.మురుగేశన్లు రెండు శ్రీవారి కల్యాణోత్సవం టికెట్ల కోసం తిరుపత్తూరుకు చెందిన నెట్ సెంటర్ నిర్వాహకుడు దళారి అన్నాదురైని సంప్రదించారు. దీంతో అతను నకిలీ పాస్ పోర్ట్ నంబర్లతో చివరి నాలుగు అంకెలు మాత్రం ఒరిజినల్ పాస్ పోర్ట్ నంబర్లు ఉండేలా చూసుకుని టీటీడీ ఆన్‌లైన్ టికెట్లను బుక్ చేశాడు. ఈ మేరకు ఈనెల 21వ తేదీ సదరు టికెట్లతో తిరుమలకు వచ్చిన ఆ ఇద్దరు భక్తులను టీటీడీ విజిలెన్స్ అధికారులు పట్టుకుని తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెమి‘కిల్’కర్మాగారాలు!

- రేణిగుంట మండలం, గాజులమండ్యం కెమికల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఏడాది కిందట రాధాకృష్ణ కెమికల్ కర్మాగారంలో కెమికల్ వ్యర్థాల లిక్విడ్‌తో కూడిన తొట్టిలో మండలంలోని పిల్లపాళెం గ్రామానికి చెందిన ఇద్దరు కార్మికులు జారిపడి మృతి చెందారు.
- గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని మల్లాడి డ్రగ్స్ కర్మాగారంలో గత ఏడాది అగ్ని ప్రమాదం జరిగింది.
- ఏర్పేడు మండలం, మేర్లపాక సమీపంలోని ఓ ఉక్కు కర్మాగారంలో ఇటీవల ప్రమాదవశాత్తు విధుల్లో ఉన్న ఓ కార్మికుడు మృతి చెందాడు.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటివి కర్మాగారాల్లో నిత్యకృత్యం. తరచూ ఏదో ఒక కర్మాగారంలో కార్మికుల ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. వెలుగులోకి వచ్చేవి కొన్నే అయితే కంపెనీ యాజమాన్యాలు ప్రమాద ఘటనలను దాచిపెట్టిన ఘటనలెన్నో ఉన్నాయి. యాజమాన్యాల అన్యాయాన్ని ప్రశ్నిస్తే వారిని ఇంటికి సాగనంపడం రివాజుగా మారుతోంది.

- తరచూ ప్రమాదాలు
- నిబంధనలు పాటించని ఫ్యాక్టరీలు
- వెలుగులోకి రాని మరణాలెన్నో?
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- విశాఖ ఘటనతోనైనా మేల్కొంటారా?


రేణిగుంట మండలం, గాజులమండ్యం కెమికల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్

ప్రధాన సేఫ్టీ చర్యలు

- కార్మికులకు షూలు, హెల్మెట్లు, మాస్క్‌లను ఇవ్వాలి
- రెడ్ జోన్‌లలో ఆక్సిజన్ సిలిండర్లను ఏర్పాటు చేయాలి
- అత్యవసర ఎగ్జిట్ ద్వారాలను ఏర్పాటు చేయాలి
- ఏదైనా విపత్తు జరగబోతోందని హెచ్చరించేలా సైరన్ మోగే విధంగా ఉండాలి
- రసాయన గాలి పీల్చే ప్రదేశాలలో కార్మికుల శ్వాస, కోశ సంబంధిన పరీక్షలు తరచూ చేయించాలి
- తరచూ ఫ్యాక్టరీలలో హెల్త్ క్యాంప్‌లను నిర్వహించాలి

తనిఖీలు చేస్తున్నాం

రేణిగుంట మండలం, గాజులమండ్యంలోని కెమికల్ కర్మాగారాలన్నింటిలోనూ తరచూ తనిఖీలు చేస్తున్నాం. అన్ని కర్మాగారాల్లోనూ కార్మికుల భద్రతకు ముప్పు వాటిల్లకుండా తగిన సేఫ్టీ చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొంత మంది కార్మికుల నిర్లక్ష్యం, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఎవ్వరూ ముందుగా ఊహించరు. ఏ కంపెనీలోనైనా సేఫ్టీ చర్యలు తీసుకోకుంటే మాకు సమాచారం ఇస్తే విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్

రేణిగుంట: ఉపాధి, ఉద్యోగాల మాట ఏమోగానీ.. జిల్లాలో ఏర్పాటైన పరిశ్రమల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించని కర్మాగారాలు చాలానే ఉన్నాయి. కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలు గాల్లో దీపంలా మారాయి. తాజాగా విశాఖ జిల్లా అచ్యుతాపురం సెజ్ ఘటన నేపథ్యంలో కార్మికలోకాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న రేణిగుంట చుట్టుపక్కల 120 నుంచి 150 పరిశ్రమలున్నాయి. ప్రధానంగా మండలంలోని గాజులమండ్యం కెమికల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలున్నాయి. వేలాది మంది కార్మికులు ఈ కర్మాగారాల్లో పని చేస్తున్నారు. ఫార్మా కంపెనీల్లో పనిచేసే కార్మికుల విధులు కత్తి మీద సాములా ఉంటాయి. ఎప్పుడు ఏ విపత్తు ఎదురవుతుందో తెలియని పరిస్థితి. కాస్త ఏమరుపాటుతో ఉంటే మృత్యువు కబళించుకుపోతుంది.

భద్రత కరువు

మండలంలోని గాజులమండ్యం కెమికల్ ఎస్టేట్‌లో మందులు, ఫెర్టిలైజర్స్ తయారీ కంపెనీలు అధికంగా ఉన్నాయి. ఈ కర్మాగారాల్లో పనిచేస్తున్న వారిలో స్థానికేతరులే ఎక్కువగా ఉన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, పూనే, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు. కార్మికులు పనిచేసే చోట అత్యంత వేడితో కూడిన రేడియేటర్లు, రియాక్టర్లు ఉన్నాయి. అక్కడ పనిచేసే కార్మికులు ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకునేందుకు చేపట్టాల్సిన భద్రత చర్యలను కంపెనీలు గాలికొదిలేశాయి.

నిబంధనలు అమలైతే ఒట్టు

జిల్లాలో నిబంధనలు పాటిస్తున్న కర్మాగారాలను వేళ్లతో లెక్కపెట్టవచ్చు. ముఖ్యంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యాలు కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టి తమ ఉత్పత్తులను తయారు చేసుకుంటున్నాయి. కొన్ని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు నిత్యం ప్రాణంతో చెలగాటమాడే విధంగా పనులు కల్పిస్తున్నారు. అలాంటి సందర్భాల్లో కొందరు కార్మికులు ప్రమాదవశాత్తూ మృతి చెందినా ఫ్యాక్టరీ యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా వారి సొంత ఊర్లకు మృతదేహాన్ని పంపేసిన సందర్భాలు అనేకమున్నాయి. కాలుష్యం స్థానికుల ఆరోగ్య భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నా పట్టించుకునే వారే లేరు.

అయ్యో..దేవుడా!

- చంద్రగిరి నాగాలమ్మ ఆలయ సమీపంలో ఘోర ప్రమాదం
- సడన్ బ్రేక్ వేసిన లారీ.. వెనుకనే వేగంగా వచ్చి ఢీకొట్టిన బైక్
- భర్త మృతి, భార్యకు గాయాలు

తిరుపతి రూరల్: లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న బైక్ దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన సునీల్(35), తన భార్య, ఐదుగురు పిల్లలతో కలిసి చంద్రగిరిలోని నాగాలమ్మ ఆలయ సమీపంలో గుడిసెలో జీవిస్తున్నారు. భర్యాభర్తలు బొమ్మలు అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బొమ్మలను అమ్ముకునేందుకు చంద్రగిరి నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వస్తున్నారు. పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై బాలాజీ డెయిరీ సమీపంలో ముందు వేగంగా వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుకనే బైక్‌పై వస్తున్న సునీల్ దంపతులు వేగంగా లారీని ఢీకొట్టారు. దీంతో తలకు తీవ్ర గాయమైన సునీల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,957 మంది స్వామివారిని దర్శించుకోగా 33,066 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించేది లేదని టీటీడీ స్పష్టం చేసింది.

నీకు మనసెలా ఒప్పిందమ్మా?

నీ కడుపులో నలుసు పడగానే సంబరపడ్డావు. నవమాసాలు మోశావు. పురిటి నొప్పులు పంటి బిగువున బిగబట్టి భరించావు. కానీ బయట ప్రపంచంలోకి అడుగు పెట్టగానే ఎందుకమ్మా నన్నొదిలి వెళ్లావు..? కళ్లు తెరవక ముందే విసిరి వీధిలో పడేశావు. రక్తపు మరకలు ఆరకముందే కిలోమీటరు రాయి వద్ద ఒంటరిగా వదిలి వెళ్లావు.. నన్నిలా వదిలి వెళ్లడానికి నీకు మనసెలా ఒప్పిందమ్మా?. నేనేం పాపం చేశానమ్మా?.. అన్నట్టు ఎక్కిళ్లు పెట్టి ఏడ్చుతున్న పురిటి బిడ్డను స్థానిక కూలీ అక్కున చేర్చుకున్నాడు. ఈ ఘటన గురువారం ఓజిలి మండలంలో చర్చనీయాంశమైంది.

- అప్పుడే పుట్టిన పురిటి బిడ్డను వదిలి వెళ్లిన తల్లి
- ఓజిలి మండలంలో ఘటన
- నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలింపు



జోష్యులవారికండ్రిగ గ్రామస మీపంలో పురిటి బిడ్డ

ఓజిలి: రక్తపు మరకలు ఆరకముందే.. బొడ్డుపేగు ఎండక ముందే ఓ మాతృమూర్తి తన పురిటి బిడ్డను వదిలి వెళ్లిన ఘటన ఓజిలి మండలం, గ్రద్దగుంట పంచాయతీ, జోష్యులవారి కండ్రిగ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. జోష్యులవారికండ్రిగ ఆర్ అండ్‌బీ అధికారులు వేసిన కిలోమీటరు రాయి పక్కనే అప్పుడే పుట్టిన ఆడ బిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు కారులతో వచ్చి గురువారం ఉదయం వదిలి వెళ్లారు. అప్పుడు సమయం ఉదయం 6.30 గంటలు. పనుల నిమిత్తం జోష్యులవారికండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రయమణ్యం బైక్‌పై వెళ్తుండగా చిన్నారి ఏడ్వడం గమనించాడు. చుట్టు పక్కల పరిశీలించగా మేల్పూరుకు 15 కిలో మీటర్ల రాయి వద్ద ఓ చిన్నారి ఏడ్చుతూ కేరింతలు కొడుతోంది. అప్పుడే పుట్టిన బిడ్డకు రక్తపు మరకలు కూడా ఆరలేదు. దీంతో అక్కున చేర్చుకుని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించి శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఆస్పత్రి సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి ఆస్పత్రికి చేరుకుని శిశువు ఆరోగ్యంపై ఆరా తీశారు. సాయంత్రం శిశువును తిరుపతిలోని శిశు సంరక్షణ కేంద్రానికి తరలిస్తామని ఆమె పేర్కొన్నారు. స్థానిక ఎస్‌ఐ రవిబాబు చుట్టు పక్కల గ్రామాల్లో విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తిరుపతి అర్బన్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, కొరుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, ఎస్పీ సుబ్బరాయుడు, కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సివిల్ రైట్స్ డేని సక్రమంగా నిర్వహించాలన్నారు. మండలాల్లో మంజూరైన అంబేడ్కర్ భవనాల వివరాలను వెల్లడించాలని కోరారు. శిథిలావస్థకు చేరిన హస్టల్ భవనాలు మరమ్మతులు చేయించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, డీవీఎంసీ సభ్యులు రాపూరిప్రసాద్ బాబు, ఎన్వీ రమణయ్య, ప్రగతి సంస్థ కేవీ.రమణ, వెంకటాచలం, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వారి సేవలు అమూల్యమైనవి

సఫాయి కరంచారీల సేవలు అమూల్యమైనవిగా కలెక్టర్ అభివర్ణించారు. కలెక్టరేట్‌లో జరిగిన మాన్యువల్ స్కావెంజర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సఫాయి కరంచారీల సేవలు వెల కట్టలేనివన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

23న గ్రామ సభలు

ఈ నెల 23న జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతూ ప్రతి గ్రామ సభకు ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ సమస్యలను చర్చించి, పరిష్కరించేలా గ్రామ సభలు ఉండాలని చెప్పారు.

గడువులోపు జాబితా సిద్ధం చేయండి

ఎలక్టోరల్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025కి సంబంధించి గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ బీఎల్‌వోలను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎలక్టోరల్ జాబితాపై తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్, ఈఆర్‌వోలతో ఆయన సమీక్షించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అక్టోబర్ 29కి ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించాలని చెప్పారు.

ఇసుక అక్రమాలను ఉపేక్షించం

- పది సచివాలయాల్లో బుకింగ్‌లు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎస్పీ

తిరుపతి అర్బన్: ఇసుక పంపిణీ పారదర్శకంగా చేపట్టడానికి పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడుతోపాటు డీఆర్వో పెంచల కిషోర్, మైనింగ్, ఆర్డీఓ, ఇతర అధికారులతో కలసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా సాక్షి దినపత్రికలో వరుసగా ఇసుక అక్రమాలపై వచ్చిన కథనాల్లోని ప్రతి పాయింట్‌ను ఆయన మీడియాకు వివరించారు. జూలై 8వ తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చిన ఇసుక పాలసీకి సంబంధించి వచ్చిన కథనాలపై ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొగళ్లగుంట, మావిళ్లపాడు, అడవికొడియంబేడు, సుబ్బానాయుడుకండ్రిగకు చెందిన నాలుగు ఇసుక పాయింట్లలో ఇసుక స్టాక్ లేకపోవడం, అన్ని నియోజకవర్గాల్లో ఇసుక పాయింట్లు లేకపోవడం, ఇసుక కొనుగోలు ధరకంటే రవాణా చార్జీలు అధికంగా ఉండడం, అధికార పార్టీ నేతలను అడ్డుకోకపోవడం తదితర అంశాలను నిశితంగా పరిశీలించినట్టు చెప్పారు. రూల్స్‌ను అతిక్రమించిన అందరిపై చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 136 కేసులు, 786 అనధికారికంగా ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్లు సీజ్ చేసినట్టు తెలిపారు. 191 మందికి షోకాజ్ నోటీసులు, 178 వాహనాలు సీజ్ చేసినట్టు కలెక్టర్ వెల్లడించారు.

నాయుడుపేటలో మరో ఇసుక పాయింట్

జిల్లాలో అదనంగా ఐదో ఇసుక పాయింట్‌గా నాయుడుపేట సమీపంలోని కలవకూరు వద్ద స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా ఒక్కో నియోజకవర్గంలోని ఒక్కో సచివాలయంలో ఇసుక బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మొత్తంగా జిల్లాలో పది సచివాలయాల్లో ఇసుక బుకింగ్‌లు ఉంటాయన్నారు. ఇసుక పాయింట్లు లేకుండా ఉండే శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, గూడూరు ఈ నాలుగు నియోజకవర్గాల్లోనూ పాయింట్లు పెట్టడానికి కృషి చేస్తామని చెప్పారు. కలెక్టరేట్‌లో ఇసుక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. తిరుపతి కలెక్టరేట్ నం.08772999077, స్టేట్ ఇసుక కంట్రోల్ రూమ్ నం .18004256035కు అక్రమాలు ఉంటే సమాచారం ఇవ్వాలని సూచించారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి ఇసుక పాలసీపై మరిన్ని మార్పులు ఉంటాయన్నారు.

1.16 లక్షల మెట్రిక్ టన్నుల విక్రయాలు

జూలై 8 నుంచి జిల్లాలో ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్ల ద్వారా 1.16 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక విక్రయించామని కలెక్టర్ తెలిపారు. పిచ్చాటూరు మండలంలోని అడవికోడియంబేడు ఇసుక పాయింట్ వద్ద 63వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని, రెండు వారాల్లో నాయుడుపేట సమీపంలోని కలవకూరు గ్రామం పాలిచెర్ల వద్ద మరో ఇసుక పాయింట్ అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

జిల్లాలో పది సచివాలయాల్లో ఇసుక బుకింగ్ కౌంటర్లు

మండలం	సచివాలయం	ఉద్యోగి ఫోన్ నం
పుత్తూరు	ఎన్‌జీవో కాలనీ	9494747587
శ్రీకాళహస్తి	ఎంఎంవాడ-02	9962215603
నాగలాపురం	సురుటుపల్లి	7207792782
సత్యవేడు	కాలమంగళపేట	9550667701
పిచ్చాటూరు	కీళ్లపూడి	9701100760
వెంకటగిరి	ఎన్టీఆర్ కాలనీ	7893806030
గూడూరు	బొగ్గులదిబ్బవీధి	9494506186
సూళ్లూరుపేట	నాగరాజాపురం	8985834027
తిరుపతి రూరల్	మల్లంగుంట	8919296779
తిరుపతి అర్బన్	మధురానగర్ 02	8328197413

రవాణా చార్జీలు ఇలా

కి.మీ	ట్రాక్టర్	6 చక్రాల లారీ	10 చక్రాల లారీ	12 చక్రల లారీ
5 కి.మీ	రూ.800			
10 కి.మీ	రూ.1000	రూ.1,800	రూ.2,600	రూ.3,500
20 కి.మీ	రూ.1500	రూ.3,000	రూ.4,000	రూ.5,000
30 కి.మీ	రూ.2,500	రూ. 3,500	రూ.5,500	రూ.6,500
30 కి.మీ పైన	0	రూ.90(అదనం)	రూ.150(అదనం)	రూ.175 (అదనం)

ఎందుకో ఈ అక్కసు?

రేణిగుంట: రేణిగుంట పంచాయతీ కార్యాలయ భవనానికి ఉన్న శిలాఫలకంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఫొటోలను అధికారులు చెరిపేశారు. గురువారం శిలాఫలకం పూర్తిగా కనబడకుండా న్యూస్ పేపర్లు అంటించారు. పంచాయతీ ఈఓ రెండు నెలలుగా లేరు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు కూడా ఏడాదిగా ఖాళీగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో శిలాఫలకాలపై పేపర్లు అంటించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.


రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద శిలాఫలకంపై అంటించిన న్యూస్ పేపర్లు

వరదయ్యపాళెం ఏఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు

వరదయ్యపాళెం: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వరదయ్యపాళెం ఏఎస్‌ఐ షణ్ముగంపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ మేరకు గురువారం జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 18 రాత్రి ఇందిరానగర్‌లో ఇద్దరి యువకులపై మరో యువకుడు దాడి చేసిన ఘటనలో బాధిత యువకులు సంఘటనా స్థలం నుంచి ఏఎస్‌ఐకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే ఆ సమయంలో ఏఎస్‌ఐ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం, మరుసటి రోజు వచ్చి ఫిర్యాదు చేయమనడం పట్ల బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేగాక దాడికి పాల్పడిన యువకుడు గంజాయి మత్తులో ఉండడం, కేసు మరోలా నమోదు చేయడం జరిగింది. దీనిపై స్వయంగా జిల్లా ఎస్పీ కేసు పూర్వాపరాలు పరిశీలించి ఏఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు వేశారు. విధి నిర్వహణలో బాధితుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

జయశంకర్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ జయశంకర్‌కు రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు కేరళలోని తిరువనంతపురంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయనకు అవార్డును అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి కల్చరల్: పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సు పోస్టర్లను గురువారం వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాకా ప్రసాద్, ఏఎన్.పరమేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ శనివారం ఉదయం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు- హత్యలు అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కోల్‌కతాలో జరిగిన సంఘటనలో నిందితులను, వారి వెనకనున్న ముఠాను శిక్షించాలని డిమాండ్ చేశారు. పౌర చైతన్య వేదిక జిల్లా కోశాధికారి ఏ.హరీష్, కమిటీ సభ్యులు ఎల్ఎన్.లక్ష్మి, విద్యార్థి సంఘ నేతలు ఎన్.నవీన్, టి.మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్‌లో కోడ్ తప్పనిసరి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంకామ్ కోర్సులో ఆప్షన్లు పెట్టుకునే విద్యార్థులు కోడ్‌ను తప్పనిసరిగా గమనించాలని కామర్స్ విభాగపు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకామ్ రెగ్యులర్ కోసం ఎస్వీయూసీ, పేమెంట్‌కోసం ఎస్వీయూసీపీఏకోడ్‌నూ, ఎంకామ్ అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ కోర్సు, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ వంటి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో చేరదలచినవారు ఎస్వీయూసీఎస్ఎఫ్ కోడ్‌ను ఆప్షన్లల్లో ఉంచుకోవాలని కోరారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుకు ఎస్వీయూసీఎస్ఎఫ్, స్పాన్సర్ సీటుకోసం ఎస్వీయూసీఎస్ఎస్ కోడ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.